క్లుప్తంగా

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



బంగారమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

దెంకాడ: మండలంలోని డి.తాళ్లవలసలో వేంచేసి ఉన్న బంగారమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. డి.తాళ్లవలస గ్రామ దేవత బంగారమ్మతల్లి పండగను ప్రజలు జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, నాయకులు, ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు.

మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రాజు



పాపయ్యరాజు

నెల్లిమర్ల: భీమవరంలో ఇటీవల నిర్వహించిన ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్‌గా విశాఖపట్నం రీజియన్ నుంచి వైఎస్‌సీహెచ్ పాపయ్యరాజు ఎన్నికయ్యారు. పాపయ్యరాజు నెల్లిమర్ల నగర పంచాయతీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈయనను పలువురు అభినందించారు.

సేవాభావంతో మెలగాలి



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న శ్రీధర్

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరు సేవా భావం అలవర్చుకోవాలని వ్యాపార వేత్త చెరుకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో 100 మంది పేదలకు బియ్యం, ఆయిల్, గోధమనూక, పంచదార, కందిపప్పు మంగళవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెట్టడంలో సంతృప్తి ఉందన్నారు. గత కొన్నేళ్లుగా మారుతీ సంఘం వారు పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, నాగరాజు, అప్పలస్వామి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుందరయ్య

విజయనగరం ఫూల్‌బాగ్: ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలని ఆర్టీసీ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సిహెచ్.సుందరయ్య డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, నగర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గింది



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గిందని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగులు ఏఆర్‌టీ మందులు మానకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ భాగస్వామ్యులకు పరీక్షలు చేయించాలని తెలిపారు. హెచ్‌ఐవీ రోగులకు ఏఆర్‌టీ మందులతో పాటు వారి భాగస్వాములకు అక్కడే హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జ్యోతిర్మయి, పద్మ, సోనిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అనధికారికంగా అమ్మితే చర్యలు

విజయనగరం క్రైమ్: మద్యం అనధికార అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు మంగళవారం సెబ్ -1 పరిధిలో దాడులు నిర్వహించారు. స్థానిక పాల్‌నగర్ సమీపంలో అనధికార మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నామన్నారు. దాడుల్లో హెచ్‌సీ ధనరాజు, కానిస్టేబుళ్లు గంగాధరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు తిలకం దిద్దుతున్న మహిళ

విజయనగరం: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయటంలో భాగంగా గడప గడపలో సంతోషాన్ని చూడటమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 3వ డివిజన్ 3వ నంబరు సచివాలయ పరిధిలోని పూల్‌బాగ్ ఆటో సెంటర్ నుంచి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాపాలన పట్ల ప్రజా స్పందనను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రహదారిలో గోతులకు వెంటనే తాత్కాలికి మరమ్మతులు చేయించాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను తీసుకువెళ్లే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిలో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని సింహభాగం సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రతిచోట ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందని, నేరుగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల ఖాతాలకే వేయడంతో అవినీతి రహితంగా పథకాల సొమ్మును ప్రజలు పొందుతున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ వజ్రపు సత్య గౌరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండా రమణ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి ముచ్చు శ్రీనివాసరావు, 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్రపు శ్రీను, వేముల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: పార్టీలో యువజన విభాగం మరింత చురుగ్గా పని చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విజయనగరం నియోజకవర్గంలో శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 22, 49వ డివిజన్‌లలో నిర్వహించిన విద్యార్థి, యువజన విభాగాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి ఎలా ఉంటుందో చేతల్లో చూపించిన నేత మన కోలగట్ల అని తెలిపారు. నాలుగున్నర ఏళ్లలో నగరం రూపురేఖలు పూర్తిగా మార్చారని.. కార్పొరేషన్ స్థాయికి తగ్గ విధంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. విద్యార్థి, యువజన విభాగాలంతా కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌లు, నాయకులు, విద్యార్థి యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మహేంద్రగిరి

విజయనగరం ఫోర్ట్: ప్రతి 20 మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారని డాక్టర్ బి.మహేంద్రగిరి తెలిపారు. స్థానిక మహేంద్ర ఆస్పత్రిలో గ్రామీణ వైద్యులకు రొమ్ము క్యాన్సర్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెల అంతా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే శతశాతం నివారించవచ్చునని తెలిపారు. ప్రతి మహిళ 35 ఏళ్లు దాటిన తర్వాత బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్ పద్ధతులు తెలుసుకోవాలని స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ప్రశాంతి అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆరాధ్య దైవం పైడితల్లి : కోలగట్ల



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: విజయనగరం ప్రజలందరి ఆరాధ్య దైవం పైడితల్లమ్మవారని, ఆ చల్లని తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా స్థానిక లంక వీధిలో నిర్వహించిన చల్లదన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు దత్తి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పైడితల్లమ్మకు చల్లదనం కార్యక్రమాన్ని చేపట్టారు. లంక వీధిలో అమ్మవారి చదురు వద్ద ఘటాలను ఉంచి మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. చదురు వద్ద నిర్వహిస్తున్న చల్లదనం కార్యక్రమానికి కోలగట్ల హాజరై పైడిమాంబ ఆశీస్సులను పొందారు. పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు చల్లా పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లు త్రినాథ్, స్థానిక కార్పొరేటర్ జకీర్ హుస్సేన్, పల్లి సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఓ సేవలు ప్రశంసనీయం



ఏపీఆర్‌ఓ నారాయణరావుకు సత్కారం

విజయనగరం అర్బన్: ఏపీఆర్‌ఓగా విధులు నిర్వహించిన నారాయణరావు సేవలు ప్రశంసనీయమని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ అన్నారు. డివిజనల్ పీఆర్‌ఓగా పదోన్నతి పొంది విశాఖపట్నం బదిలీ అయిన నారాయణరావుకు కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించే నారాయణరావు బదిలీ కావడం జిల్లాకు తీరని లోటని పేర్కొన్నారు. ఉద్యోగంలో చేరిన అతి తక్కువ కాలంలోనే డివిజనల్ పీఆర్‌ఓగా పదోన్నతి పొందారని మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సత్కారం అనంతరం నారాయణరావు మాట్లాడుతూ జిల్లాతో, సిబ్బందితో తన అనుబంధం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఎస్‌వీ రమణ, డివిజనల్ పీఆర్‌ఓ ఎస్.జానకమ్మ, జేఆర్‌ఈ మల్లేశ్వర్రావు, పీఆర్‌ఓ ఎం.వాసుదేవ రావు, ఏఈ శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రభుదాస్, టైపిస్టు వెంకటరావు, పబ్లిసిటీ అసిస్టెంట్ సత్యనారాయణ, ఫొటోగ్రాఫర్లు మురళి, వెంకట్, నాయుడు, టెక్నీషియన్ మాధవ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవడం కనీస బాధ్యత

విజయనగరం క్రైమ్: అమరవీరులను స్మరించుకోవడం మనందరి కనీస బాధ్యతని వన్‌టౌన్ సీఐ డాక్టర్ బి.వెంకటరావు తెలిపారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక చైతన్య కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ‘ దేశ నిర్మాణంలో పోలీసుల పాత్ర’ అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పోలీసులు విధి నిర్వహణలో ప్రజల కోసం పోరాటం చేసి అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు సిహెచ్.రాంబాబు, భాస్కర్, శ్రీధర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పాత పెన్షన్ సాధనకు నిరవధిక దీక్షలు

- షెడ్యూల్ ప్రకటించిన యూటీఎఫ్ జిల్లా కమిటీ



పోస్టరును విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీడ్ పెన్షన్ విధానం (జీపీఎస్)కు బదులుగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 19వ తేదీ నుంచి కలెక్టరేట్ జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద నిరవధిక నిరసన దీక్షలు చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రకటించింది. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 18 నుంచి రాష్ట్ర కేంద్రంలో, 19 నుంచి జిల్లా కేంద్రాల్లో, 20 నుంచి తాలూకా కేంద్రాల్లో ఈ నిరసన దీక్షలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. తొలిత నిరసన షెడ్యూల్ పోస్టర్‌ను విడుదల చేసారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి కేపీవీఆర్‌కే ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, ఎస్.సత్యనారాయణ, సీహెచ్ తిరుపతినాయుడు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణాదేవి అలంకరణలో బాలా త్రిపుర సుందరీదేవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేట గ్రామంలో పురాతన శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక హోమాలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పూజాధికాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించి నూతన వస్త్రాలతో అలంకరించారు. తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

పూడమ్మతల్లి వారాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల గ్రామ దేవత శ్రీ పూడమ్మతల్లి వారాల పండుగ మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని అమ్మవారి చదురుగుడి వద్ద వేకువ జామున ఐదు గంటల నుంచే భక్తులు రాక మొదలైంది. పట్టణమంతా అమ్మవారి ఘటాలు ఊరేగించారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు : డీఐజీ

విజయనగరం క్రైమ్: పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఓవర్ లోడ్ వాహనాలపై కఠిన చర్యలు చేపట్టి, వాటిపై నిబంధనల మేరకు ఎంవి.చలానాలను విధించాలని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సీడీ ఫైల్స్, రిసెప్షన్ పనితీరు, స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్‌ఐలు లోవరాజు, ఎమ్.రాజు, త్రినాథరావు, పాల్గొన్నారు.

గాయత్రీ దేవీ అలంకరణలో దుర్గమ్మ



గాయత్రీ మాత అలంకరణలో దుర్గాదేవి

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో కొలువైన దుర్గాదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం గాయత్రీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వసంత గోష్టి సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

సమాజ సేవలో యువత పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- చాంబర్ ఆఫ్ కామర్స్ యూత్ వింగ్ ప్రమాణ స్వీకారం

విజయనగరం: సమాజ సేవలో చాంబర్స్ ఆఫ్ కామర్స్ యూత్ వింగ్ చురుకైన పాత్ర పోషించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయ భవనంలో మంగళవారం జరిగిన యూత్ వింగ్ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా గుడిశ కార్తీక్, కార్యదర్శిగా కేదారిశెట్టి వెంకన్నబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు సామాజిక సేవా కార్యక్రమాలలో చాంబర్ ఆఫ్ కామర్స్ చురుకైన పాత్రను పోషించిందని, అదే రీతిలో నూతన ఒరవడితో, కొంగొత్త ఆలోచనలతో వ్యాపార రంగంలో మరింత వినూత్న సంస్కరణలు తీసుకొచ్చి ముందుకు సాగాలని యువ వ్యాపారవేత్తలకు సూచించారు. కరోనా సమయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అందించిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేనివని గుర్తు చేశారు. యూత్ వింగ్ అధ్యక్షుడు కార్తీక్, కాపుగంటి ప్రకాష్, ప్రత్యేక ఆహ్వానితులు ఎం.ఆదిశంకర్, రంజిత రెడ్డి, నాగేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుల నియామకం



నూతన డివిజన్ అధ్యక్షుడిని అభినందిస్తున్న కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ బలోపేతంలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని రెండు డివిజన్‌ల పార్టీ నూతన అధ్యక్షులను నియమిస్తూ ఎమ్మెల్యే, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిర్ణయం తీసుకున్నారు. ఆయా డివిజన్‌లలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. 45వ డివిజన్ నూతన అధ్యక్షుడిగా తాళ్లపూడి రమణమూర్తి, 46వ డివిజన్ అధ్యక్షుడిగా కె.తవుడును నియమించారు. సమావేశాల్లో జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమన్నశెట్టి, తమ్ము, పార్టీ నాయకులు పండు, కన్నం నాయుడు, కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, గోవిందమ్మ, టి.రమణ, జామి సూరిబాబు, మాధవి, దొంతల శ్రీను, మజ్జి ఆదినారాయణ, మహంతి అప్పన్న, యువజన అధ్యక్షుడు ప్రవీణ్, గజ్జి మురళి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సంక్షేమ క్యాలెండర్లు ప్రదర్శించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: సంక్షేమ క్యాలెండర్లను సచివాలయాల్లో ప్రదర్శించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పథకాల అములులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించటానికి నవంబరు 1నుంచి అన్ని సచివాలయాల్లో నగర పంచాయతీ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అవగాహనపై వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులతో మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజరు టివిఎస్.విశ్వేశ్వర రావు, మెప్మా సీఎంఎం డి.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు



పూసపాటిరేగ: చింతపల్లి 1 సచివాలయ పరిధిలో జగనన్న సురక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

పైడితల్లికి చల్లదనం



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు

విజయనగరం/ విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి మంగళవారం భక్తులు చల్లదనం నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, శ్రీకాకుళం, మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొని నగరంలోని ఒకటి, 20, 21 డివిజన్‌లో ఉన్న తూర్పు బలిజివీధి, నల్లావీధి, బుచ్చెన్నకోనేరు, కొత్తూరు ప్రాంతాలకు చెందిన భక్తులతో కలిసి భారీగా అమ్మవారికి ఘటాలు సమర్పించారు. అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గోల్డ్ అనుకొని...

విజయనగరం క్రైమ్: తన మెడలో ఉన్న రోల్డ్ గోల్డ్ పుస్తెల తాడును లాక్కొని పరారైన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది ఓ వృద్ధురాలు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని కోరింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. కొత్త అగ్రహారంలో నివాసం ఉంటున్న 70 ఏళ్ల మేడూరు వెంకటలక్ష్మి ఇంట్లో ఫ్యాన్ కొద్దిరోజులుగా పని చేయడం లేదు. అటుగా వెళ్తున్న వ్యక్తిని పిలిచి ఎలక్ట్రీషియన్ పని వచ్చా అని ప్రశ్నించింది. అతను తెలుసునని చెప్పి స్టూల్ తెప్పించుకుని ఫ్యాన్ చూస్తూనే.. వృద్ధురాలి మెడలో ఉన్న తాడును పరిశీలించి, అది బంగారమేనా ? అని అడిగాడు. అందుకు ఆమె హా.. అది బంగారమేనంటూ హాస్యాస్పదంగా చెప్పడంతో వెంటనే స్టూల్ దిగి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు లాక్కొని పరారయ్యాడు. ఆమె గట్టిగా కేకలు వేసినప్పటికీ సమీపంలో ఉన్నవారు వచ్చేసరికి అతను ఉడాయించాడు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కోరిక మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.